# ఎ ఫెలో ట్రావెలర్!

రచన:
శ్రీ ఎ. యం. అయోధ్యా రెడ్డి.

(గత సంచిక తరువాయి)

"ఓ...అయాం సారీ!"_తన తెలివి తక్కువకి సిగ్గు పడుతూ అన్నాడు రవికిరణ్.

చాలాసేపు గడిచింది__

రవికిరణ్ బెర్తు మీద బెడ్డింగ్ పరుస్తూ అన్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ మాడమ్...!"

"అబ్బబ్బ...! మళ్ళీ ఏం కావాలి మిస్టర్?"

"అహఁ! ఏమీలేదు. మీరెట్లాను రాజమండ్రి వరకొస్తున్నారుగా, ఆ వూరు రాగానే నన్ను లేపుతారా...కాస్త కునుకు తీస్తాను_"

"ఏమిటీ...! మిమ్మల్ని రాజమండ్రిలో నిద్ర లేపాలా?" విచిత్రంగా చూసిందామె "మీ ధోరణి చాలావరకు పోతోందే! నా కటువంటి పనులు నచ్చవ్. నేను లేపను_"

"పోనీ ఏవైనా కబుర్లు చెప్పండి...నిద్రరాకుండా వుంటుంది_" టక్కున అన్నాడు రవికిరణ్.

"దారినపోయే దానయ్య అందరితోనూ మాట్లాడ్డానికే నేనీ ప్రయాణం చేస్తున్నాననుకొన్నారా? ఇటువంటి పిచ్చి పిచ్చి ఆలోచన్లు మానేసి కాస్త నన్ను విసిగించకుండా వుంటారా...!"

అంత ఖచ్చితంగా మాట్లాడిన ఆ అమ్మాయి మనస్తత్వాన్ని మనసులోనే తిట్టుకొంటూ పడుకున్నాడు రవికిరణ్. ఇక మళ్ళీ ఆమెను పల్కరించే ప్రయత్నం చేయలేదు.

టక్...టక్ మంటూ లయబద్ధంగా శబ్దం చేస్తూ పయనిస్తున్న రైలు బండి సున్నితమైన కుదుపులకి కొద్దిసేపట్లోనే అతను నిద్రలోకి జారి పోయాడు.

అతను తిరిగి కళ్ళు విప్పేసరికి రైలు సరిగ్గా రాజమండ్రి స్టేషన్‌లో మెల్లగా ఆగుతోంది.

లేచి చూస్తే_ఇంత క్రితం అమ్మాయి...ఉరఫ్ క్లియోపాత్ర క్రెయిన్ దిగుతోంది.

గబగబా తన సామాను సర్దేసుకొని, ఆ యువతి వెనకాలే ప్లాటు ఫారమ్ మీద అడుగు పెట్టాడు రవికిరణ్.

తలవొంచుకొని, మంద గమనంతో నడుస్తోందా యువతి ప్లాటు ఫారమ్ మీద. త్వరగా నడిచి, ఆమెను దాటేస్తూ_"గుడ్ బై కనక దుర్గమ్మగారూ!" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

ఆ అమ్మాయి ఒక్కసారి తలెత్తి, అతని కళ్ళలోకి చురుగ్గా చూసింది. తర్వాత టాక్సీ ఎక్కి వెళ్ళిపోయింది.

రవికిరణ్ మనసు బాధతో మూల్గింది.

ఇంతసేపు ప్రయాణం చేసి, ఆమె గురించి ఒక్క విషయమైనా తెల్సుకోనందుకు తన్నుతానే నిందించుకొన్నాడు. ఆ అమ్మాయి కలయిక అతని హృదయంలో చెరగని ముద్రవేసింది.

తను కూడా టాక్సీలో ఇల్లు చేరుకొన్నాడు.

ఎదురుగా పచ్చని తోరణాలతో పెళ్ళికళను ప్రతిబింబిస్తున్న తను ఇంటిని చూడగానే రవికిరణ్‌లో అపుకోలేని ఉత్సాహం ఉరకలు వేసింది.

ఇన్ని సంవత్సరాల వియోగం తర్వాత, తిరిగి తల్లినీ...చెల్లాయినీ చూడబోతున్నాననే ఆరాటం_అతని అడుగులు తడబడేలా చేసింది.

నెమ్మదిగా ఇంట్లో ప్రవేశించాడు.

అందరూ హడావిడిగా పెళ్ళి పనుల్లో తిరుగుతున్నారు. అంచేత, రవికిరణ్‌ని ప్రత్యేకించి ఎవ్వరూ గుర్తుపట్టలేక పోయారు.

నేరుగా ఇంట్లోకి నడిచాడతను__

TRADE MARK
Panju TEX

మన్నికకు, అహ్లాదానికి...

పంజు టెక్స్ వారి

* మాస్టర్ * ఫాంటెక్స్

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:__

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం_4.

వంటింట్లో చాలా మంది ఆడవాళ్ళు కూర్చొని, పిండి వంటలు చేసే ప్రయత్నంలో వున్నారు.

తలుపు మీద రెండు చేతులూ ఆనించి, వంటింట్లోకి తొంగి చూస్తూ "అమ్మా!" అని పిల్చాడు రవికిరణ్.

"ఎవరూ...?" బూరెల మూకుట్లో నూనె వొంపుతున్న పార్వతమ్మతో పాటు, అందరూ తలెత్తి చూశారు.

"నేనమ్మా...నీ రవికిరణ్ ని"

పట్టుకున్న నూనె డబ్బా కింద పెట్టింది పార్వతమ్మ. "బాబూ...రవీ!" ఆనంద పారవశ్యంతో ముందుకొచ్చి, కొడుకును కౌగలించుకొని మృదువుగా ఒళ్ళు నిమిరింది.

"నా తండ్రీ! ఎంత కాలానికి చూశానురా నిన్ను...! ఇంత కాలం కళ్ళల్లో ఒత్తులు వేసుకొన్నాను నాయనా నీకోసం. ప్రయాణం ఖులాసాగా జరిగిందా బాబూ...!"

తల్లి ఆప్యాయతకి పొంగిపోయిన రవికిరణ్ చిన్నగా మందహాసం చేశాడు. "అంతా బాగానే జరిగింది అమ్మా! కాని, చెల్లాయి ఏదీ...ఎక్కడా అగుపించదేం...?" చుట్టూ కలియ జూస్తూ ప్రశ్నించాడు.

"నాలుగు రోజుల క్రితం స్నేహితురాలి వూరికి వెళ్ళి, ఇందాకే తిరిగొచ్చింది నాయనా! వొచ్చిరాగానే మామయ్యని వెంటేసుకొని బాజారు కెళ్ళింది...ఏవో కొని తేవడానికి అదిప్పట్లో తెమిలి వొస్తుందా ఏమన్నా...? పద రవీ...! నువు స్నానం చేసి, ప్రయాణ బడలిక తీర్చుకో బాబూ... ఈలోగా చెల్లాయి వొస్తుంది_"

అంటూ చెప్పి, ఏర్పాట్లు చేయడానికి వెళ్ళింది పార్వతమ్మ.

అరగంటలో స్నాన భోజనాదులు ముగించుకొని, పైన ప్రవీణ గదిలో రేడియో వింటూ కూర్చొన్నాడు రవికిరన్.

ఇంతలో__"అన్నయ్యా!" అని సంతోషంగా పిలుస్తూ ఆత్రంగా గదిలో ప్రవేశించింది ప్రవీణ.

ఎదురుగా రవికిరన్ ని చూడగానే - ఒక్కసారిగా అదిరిపడి, ఆశ్చర్యంలో నిశ్చేష్టురాలై నిలబడి పోయింది.

చటుక్కున లేచి నిలబడిన రవికిరన్ కూడా అచేతనుడై పోయాడు. తను చూస్తున్నది వాస్తవమో కాదోనన్న అనుమానం కల్గిందతనికి.

బొమ్మల్లాగా నిలువు గుడ్లేసుకొని, ఇరువురూ...ఒకరి వేపు మరొకరు చూస్తుండి పోయారు.

చాలా సేపటికి తేరుకొన్న ప్రవీణ - అన్నయ్యా...! అంది నిద్రలో కలవరించినట్లు.

చె...ల్లా...య్! తడబాటుగా...ఒక్కొక్క అక్షరమే రవికిరన్ పెదాల మధ్యనుంచి బయల్పడ్డాయ్.

ఎదురుగా నిలబడిన ప్రవీణ ఎవరో కాదు__క్వీన్ ఎలిజబత్, క్లియోపాత్ర, కనకదుర్గ...తదితర పేర్లతో... ట్రెయిన్ లో పరిచయమైన అమ్మాయే...!

(సంపూర్ణం)



శ్రీ డి. రమానాయుడుగారు సురేష్ మూవీస్ తరపున తీసే తదుపరిచిత్రం పూజాదృశ్యం.